క్లుప్తంగా

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


యోగాసనాలు చేస్తున్న పోలీసు అధికారులు

కొత్తగూడెంఅర్బన్/కొత్తగూడెంటౌన్: పోలీసు ఉద్యోగులు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డీఎస్పీ రెహమాన్ సూచించారు. హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఉద్యోగులకు యోగా తరగతులు ఏర్పాటు చేయగా డీఎస్పీ మాట్లాడారు. యోగా ద్వారా మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. సీఐలు వెంకటేశ్వర్లు, ఎం.కరుణాకర్, రమేష్‌కుమార్, శివప్రసాద్, ఆర్‌ఐలు లాల్, బాబు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఉపాధి కల్పానా శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీ వారు ఎనిమిది మందిని ఎంపిక చేసి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసినట్లు జిల్లా ఉపాధికల్పానాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు.

అన్ని విభాగాలకూ జరిమానా వర్తింపజేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పెనాల్టీ విధానంలో మార్పులను అన్ని విభాగాలకు వర్తింపజేయాలని ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం డైరెక్టర్(పా) కే.వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. స్పందించిన డైరెక్టర్ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

ఆర్టీసీలో మర్యాద దినోత్సవం

చుంచుపల్లి: ఆర్టీసీలో మర్యాద దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తగూడెం బస్టాండ్‌లో అధికారులు ప్రయాణికులకు సిబ్బంది పూలు అందించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం దేవేందర్‌గౌడ్ క్యూఆర్ కోడ్ కలిగిన కీ చైన్లను అందించి ఆర్టీసీ సేవల గురించి వివరించారు.

చెరువు మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

కొత్తగూడెంటౌన్: చిట్టి రామవరంలోని తండాలో ఉన్న రెండు చెరువుల తూము, కాల్వ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు బానోతు రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిట్టి రామవరంలోని చెరువుల వద్ద పరిశీలించారు. మాట్లాడుతూ.. తండాను అనుకుని నల్ల చెరువు, ఎర్ర చెరువులు ఉన్నాయని వీటి ద్వారా దాదాపు 125 ఎకరాల పంట పొలాలకు నీటి సదుపాయం అందుతుందన్నారు. కాల్వ నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

దాడులు ఆపాలి

ఇల్లెందురూరల్: పోడు రైతులపై అటవీశాఖ అధికారుల దాడులు ఆపాలని పీడీఎస్‌యూ జాతీయ కమిటీ నాయకుడు మహేష్ డిమాండ్ చేశారు. మర్రిగూడెం గ్రామపంచాయతీలో శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గ్రామాలకు తరలండి కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏజెన్సీలో అటవీశాఖ అధికారుల దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యమయ్యాయని విమర్శించారు. ఏజెన్సీలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేష్, శ్యామ్, గౌతమ్, భరత్, సాగర్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి..

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ మంగతార, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ టీచర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని టేకులపల్లి 2 కేంద్రం అంగన్‌వాడీ టీచర్ కుంజా భద్రమ్మ కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు లేఖ అందించినట్లు చెప్పారు. ఈ విషయమై టేకులపల్లి సీడీపీఓ కేఎం తారను వివరణ కోరగా.. ఆరోపణలు అవాస్తవమన్నారు.

కదలని ట్రాక్టర్లు.. పేరుకుపోతున్న చెత్త


సుభాష్‌నగర్‌లో మూలపడిన ట్రాక్టర్

- పంచాయతీల్లో గాడి తప్పుతున్న పారిశుద్ధ్య నిర్వహణ
- నిధుల లేమితో సతమతమవుతున్న కార్యదర్శులు
- తరుముకొస్తున్న వర్షాకాలం


విజయలక్ష్మి నగర్‌లో రహదారిని అల్లుకుపోయిన పిచ్చిమొక్కలు

ఇల్లెందురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు నిలిచిపోవడం, ఖాతాలపై ఫ్రీజింగ్ కారణంగా కనీస పనులు కూడా ముందుకు సాగక గ్రామపంచాయతీలలో పాలన నిలిచిపోయింది. ఏ పని చేయాలన్నా నిధుల కొరత అడ్డొస్తోంది. కనీసం పారిశుద్ధ్యమైనా మెరుగుపర్చే పరిస్థితి లేకుండా పోయింది. మరో పక్షం రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతోంది. ఈ సమయంలో ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టకపోతే రానున్న రోజుల్లో ప్రజారోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

మొక్కుబడి విధుల్లో ట్రాక్టర్లు..
గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ట్రాక్టర్లను కొనుగోలు చేయడంతోపాటు మల్టీపర్పస్ వర్కర్లను నియమించారు. వర్కర్ల వేతనాలు చెల్లిస్తున్న ప్రభుత్వం పంచాయతీల నిర్వహణకు అవసరమైన నిధులను మాత్రం విదల్చడం లేదు. దీంతో పారిశుద్ధ్య పనులు గాడితప్పాయి. ప్రధానంగా డీజిల్ కొనేందుకు డబ్బులు లేకపోవడంతో కొన్ని పంచాయతీలలో ట్రాక్టర్లను నడపడం లేదు. గ్రామంలో శుభ, అశుభ కార్యక్రమాలకు వీటిని ఉచితంగా తరలించేందుకు మాత్రమే వినియోగిస్తున్నారు. మరికొన్ని గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు అప్పు చేసి పారిశుద్ధ్య పనులు, ట్రాక్టర్ నడపడం, ఇతరత్రా పనులు నెట్టుకొస్తున్నారు. ఇప్పటి వరకు పంచాయతీల నిర్వహణ కోసం రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు అప్పులు చేసినట్లు పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

నిధుల జాడేదీ.. గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు నిధుల లేమి సమస్యతో పంచాయతీ కార్యదర్శులు ప్రతీ పనికి దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. 2024 ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పాలకవర్గాలు లేకపోవడంతో 14 నెలలుగా ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. మరోవైపు పన్నుల రూపంలో వచ్చే నిధులను విడుదల చేసుకునే పరిస్థితి లేదు. గతంలో ఈ నిధుల తీర్మానంతో ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉండేది. ఈ విధానం రద్దు చేయడంతో ఖాతాల్లో నిధులు ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది.

కొరవడిన పర్యవేక్షణ...
ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పనిఒత్తిడితో పంచాయతీ పాలనపై కార్యదర్శుల పర్యవేక్షణ కొరవడింది. మండల కేంద్రాలలో నిర్వహించే సమావేశాలు, లబ్ధిదారుల ఎంపిక, ఆన్‌లైన్ పనుల పేరుతో పంచాయతీ కార్యదర్శులు వారంలో మూడు రోజులు మండల కేంద్రాలకే పరిమితమవడం, ప్రత్యేకాధికారులు గ్రామ పంచాయతీలవైపు చూడకపోవడం, మండల, జిల్లా అధికారుల పర్యటనలు సన్నగిల్లడం వంటి కారణాలతో పంచాయతీలలో పాలన గాడి తప్పిందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

వానాకాలం వచ్చినట్టే..
ప్రస్తుతం గ్రామపంచాయతీలలో ఏ వీధిలో చూసినా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయి. పారిశుద్ధ్యం మెరుగుపర్చుకునేందుకు ఉన్న వనరులను వినియోగించుకుంటూ ముందస్తు ప్రణాళికతో నడుచుకోవాల్సిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో గ్రామపంచాయతీల్లో చెత్తకుప్పలు పేరుకపోతున్నాయి. వేసవిలోనే వీధులలో పచ్చిరొట్ట, పిచ్చిమొక్కలు మురుగుకాల్వలను అల్లుకుపోయాయి. మరో పక్షం రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతోంది. చెత్త రెట్టింపు స్థాయిలో పెరుగుతుంది. ఇది గ్రామాలలో ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతుంది.

చెత్త ట్రాక్టర్ వస్తలేదు..



గ్రామపంచాయతీలో ఇంటింట చెత్త సేకరణ కోసం వారం రోజులుగా ట్రాక్టర్ వస్తనేలేదు. ఇళ్లలోని చెత్త ఎక్కడ వేయాలో తెలియడం లేదు. వీధుల్లో చెత్త కుప్పలు పేరుకపోయాయి. అధికారులు వెంటనే పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి.

– బొమ్మ మాధవి, తిలక్‌నగర్

నిధులు లేక ట్రాక్టర్లు నడపడం లేదు..



డీజిల్ కొనేందుకు కూడా డబ్బులు లేక కొన్ని పంచాయతీల్లో ట్రాక్టర్లను నడపడం లేదు. ఇప్పటి వరకు పంచాయతీల నిర్వహణ కోసం కార్యదర్శులు చేసిన అప్పు భారంగా మారింది. ఇదే విషయం ఉన్నతాధికారులకు నివేదించాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు

పరమత సహనం పాటించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి: ప్రతీఒక్కరు పరమత సహనం పాటించి, సోదర భావంతో కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. జూన్ 7న బక్రీద్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో అన్ని మతాల పెద్దలతో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో మాట్లాడారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, ఎద్దులను వధించడం నిషేధమని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే కొన్ని తప్పుడు పోస్టులకు ప్రభావితమై కులమతాలను రెచ్చ గొట్టే విధంగా మాట్లాడటం, పోస్టులు పెట్టడం, దాడులకు పాల్పడటం లాంటివి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతపెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పండుగల సమయంలో పోలీసు శాఖ నుంచి ప్రత్యేక నిఘా ఉంటుందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ తాటిపాముల సురేందర్, ఎస్‌ఐలు రాజేందర్, శ్రీకాంత్, హిందూ, ముస్లిం, క్రైస్తవ, మతపెద్దలు పాల్గొన్నారు.

ఎస్‌ఐకు సన్మానం

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ జలకం ప్రవీణ్‌ను శుక్రవారం కొత్తగూడెంలోని ఆయన కార్యాలయంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ యాస యుగేందర్, ఐఏఎల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

రేపు ఆదివాసీ మహాగర్జన సభ

ఇల్లెందు: సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 18న ఆదివాసీ మహాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ కొడెం వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యోగి మృతికి నివాళి

ఇల్లెందురూరల్: నిజామాబాద్ జిల్లా బోధన్ అసిస్టెంట్ లైన్‌మెన్ మహేందర్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఈ మేరకు విద్యుత్ ఇల్లెందు సబ్‌డివిజన్ ఉద్యోగులు శుక్రవారం విచారం వ్యక్తం చేశారు. కార్యాలయ ఆవరణలో మౌనం పాటించి మహేందర్‌కు నివాళులర్పించారు. ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ సుధాకర్, ప్రసాదరావు, ఏఈలు రతన్‌కుమార్, హసీనా, చలమయ్య, పూర్ణచందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు, ఎరువులను నివారించండి..

జూలూరుపాడు: కల్తీ విత్తనాలు, ఎరువులను నివారించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, ఏఐయూకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో అన్నారుపాడు, గుండ్లరేవు, రాంపురంతండా, వీరభద్రాపురం, పడమటనర్సాపురం, వినోభానగర్‌లలో గ్రామస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్, పైదా వెంకటేశ్వర్లు, తెల్లం కృష్ణయ్య, గుగులోత్ బాలకోటి, బాబురావు, జవహర్‌లాల్, తాటి నరసింహారావు, బానోత్ ధన్వంతరావు, తదితరులు పాల్గొన్నారు.


అన్నారుపాడులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

పాల్వంచ: ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, ఏజెన్సీ గ్రామాల్లో మొహరించిన కేంద్ర సైనిక బలగాలు వెనక్కి పిలవాలని మావోయిస్టు పార్టీలతో చర్చలు జరపాలని పలు పార్టీ నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ఆదివాసీ ప్రాంతాల్లో సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు ప్రయత్నాలు సాగిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో టీజేఎస్, సీపీఐ, ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఎం, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు గొని నాగేశ్వరరావు, బరగడి దేవదానం, ఉపేందర్, నిమ్మల రాంబాబు, శ్రీపాద సత్యనారాయణ, మంజూరు అలీ, రాంచందర్ రావు, అఫ్జల్‌ఖాన్, ఐలయ్య పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ కాలనీ, నెహ్రూనగర్, శివనగర్, పేట చెరువు, శ్రీనివాస కాలనీ, అయ్యప్ప నగర్ ప్రాంతాల్లో రూ.1.95 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఎస్‌కే సాబీర్ పాషా, కొత్వాల శ్రీనివాసరావు, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, ఇట్టి వెంకట్రావ్, చెరుకూరి శేఖర్, మన్నెం వెంకన్న, వల్లపు యాకయ్య, గౌస్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయులు పోక్సో చట్టం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. శుక్రవారం జిల్లా విద్యా శిక్షణ కేంద్రం కొత్తగూడెంలో జరుగుతున్న ఆంగ్ల ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పోక్సో చట్టం, బాలికల అక్రమ రవాణా, సైబర్ నేరాల పట్ల ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కేవలం నేరం చేయడమే కాకుండా, నేరాన్ని దాచిపెట్టడం కూడా నేరంగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన దగ్గర నుంచి ఇంటికి వెళ్లే వరకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు సమాధానం ఇవ్వొద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయండి..

జూలూరుపాడు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్, మండల కార్యదర్శి యాసా నరేష్ మాట్లాడుతూ.. అనర్హులకు ఇళ్లు కేటాయించి, అర్హులకు అన్యాయం చేశారన్నారు. ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగలేదని, ఇందిరమ్మ కమిటీలను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పూరిగుడిసెలు, రేకుల ఇళ్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వలేదని, వితంతువులు, దివ్యాంగులకు సైతం ప్రాధాన్యం కల్పించలేదన్నారు. గ్రామసభలు నిర్వహించి నెలలు గడుస్తున్నా కొత్తగా ఏ ఒక్కరికి రేషన్ కార్డు మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీని అమలుచేయాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డిలకు వేర్వేరుగా అందజేశారు. కార్యక్రమంలో బానోత్ ఇస్రా, గార్లపాటి వెంకటి, పద్దం సుగుణ, వల్లమల్ల చందర్‌రావు, రెడ్డిబోయిన గోవిందు, ఇల్లంగి సీతారాములు, బొల్లి లక్ష్మయ్య, బోడా అభిమిత్ర, ధరావత్ వేణు పాల్గొన్నారు.


తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

నేడు కిన్నెరసాని బ్రిడ్జి ప్రారంభోత్సవం


కిన్నెరసాని వాగుపై బ్రిడ్జి

పాల్వంచరూరల్: ఎట్టకేలకు కిన్నెరసాని వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించనున్నట్లు ఆర్ అండ్‌బీ డీఈ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అనంతరం సోములగూడెం రోడ్డులో బిక్కుతండా వద్ద సీఎస్‌ఆర్ పాలసీ నిధులు రూ.4కోట్ల వ్యయంతో బూడిద వాగుపై హైలెవల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మంత్రితోపాటు ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ హాజరుకానున్నట్లు తెలిపారు.

అప్రోచ్‌రోడ్డు పనులేవీ?
రివిట్‌మెంట్ పనులు చేయకుండా వదిలేశారు. వర్షాలకు బ్రిడ్జికి ఇరువైపుల అప్రోచ్ రోడ్డుకు పోసిన మట్టి కోతకు గురైంది. రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య కిన్నెరసాని వాగుపై 2021లో ప్రారంభించి రూ.9.70లక్షల వ్యయంతో రెండున్నరేళ్లకు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా అప్రోచ్ రోడ్డు పనులు చేయాల్సి ఉంది. అయితే బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు ఒకవైపు బండరాళ్లతో రివిట్‌మెంట్ కట్టారు. నాణ్యతా లోపంతో బీటలు బారాయి. కిన్నెరసాని వాగులో వరద ప్రవహిస్తే ఇక్కడ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు అప్రోచ్ రోడ్డు కోసం పోసిన మట్టి కిందకు జారిపోకుండా రివిట్‌మెంట్ నాణ్యంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పనులన్నీ పూర్తి చేయిస్తాం..
కిన్నెరసాని వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయి. పెండింగ్ పనులను కూడా త్వరలోనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తాం. అప్రోచ్ రోడ్డు కింద భాగంలో రివిట్‌మెంట్‌కు అగ్రిమెంట్‌లో లేదు. అయినా నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి చర్యలు తీసుకుంటాం.

– వంశీ, ఆర్‌అండ్‌బీ ఏఈ

స్మార్ట్ ఫోన్లకూ ఎండదెబ్బ..!

- ఎండ వేడి తగిలితే ఫోన్లకు నష్టమే
- వేసవి నేపథ్యంలో జాగ్రత్తలు అవసరం



చుంచుపల్లి: మండు వేసవి నేపథ్యంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలు దాటితే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. సాయంత్రం ఆరు గంటల వరకూ ఎండ తీవ్రత తగ్గడం లేదు. అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవడానికి జనం అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే మనం వాడే ఎలక్ట్రానిక్స్ పరికరాల సంగతి ఏమిటి? ముఖ్యంగా స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలకు కూడా ఎండ వల్ల నష్టం జరుగుతుంది. వాటిని కూడా ఎండ నుంచి కాపాడుకోవడం చాలా అవసరం. భానుడి కిరణాలు ఎలక్ట్రానిక్ వస్తువులను పూర్తిగా నష్టపరుస్తాయని నిపుణులు, మెకానిక్‌లు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ సమయం ఎండలో ప్రయాణం చేసే వారి మొబైల్‌లో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. స్మార్ట్ ఫోన్‌ను ఎక్కడైనా, ఎలాగైనా ఉపయోగించవచ్చు అనుకోవడం పొరపాటే. తక్కువ ఉష్ణోగ్రతలనే ఎలక్ట్రానిక్ పరికరాలు భరిస్తాయి. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేవు. సాధారణంగా ఫోన్‌ను ఎక్కువగా వాడితే వేడెక్కిపోతుంది. ఇక వేసవి ఎండ వాటిపై పడితే మరింత చేటు కలుగుతుంది. ముఖ్యంగా బ్యాటరీపై ప్రభావం పడుతుంది. స్క్రీన్‌పై పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. ఫోన్‌లోని ప్రాసెసర్లు వేడిని తట్టుకోలేవు. ఉష్ణోగ్రత పెరిగినప్పుడు వాటి పనితనం తగ్గిపోతుంది. ఆ సమయంలో ఎక్కువ బ్యాటరీ శక్తి ఖర్చువుతుంది. బయటి ఎండలకే తట్టుకోలేకపోతున్న సమయంలో స్మార్ట్‌ఫోన్లను ఎక్కువ సమయం బిగుతైన జేబులలో పెట్టుకోవడం మంచిది కాదు.

వేడి ఎక్కువైతే ప్రమాదం...
24 గంటలు స్మార్ట్ ఫోన్ వాడుతుంటే మరి ఎప్పటికప్పుడు చార్జింగ్ పెట్టాల్సి ఉంటుంది. అసలే ఎండాకాలం ఈ అధిక వేడి కారణంగా మన స్మార్ట్‌ఫోన్లు త్వరగా వేడెక్కుతాయి. ముఖ్యంగా గేమ్స్ ఆడుతున్నప్పుడు లేదా కెమెరా వాడుతున్నప్పుడు ఈ వేడి వల్ల స్మార్ట్‌ఫోన్లు పేలిపోయే ప్రమాదం ఉంది. కొన్ని జాగ్రత్తల వల్ల మనం ఈ ప్రమాదం నుంచి కాపాడుకోవచ్చు.

- స్మార్ట్ ఫోన్లపై ఎక్కువ సేపు ఎండ పడితే స్క్రీన్‌పై ఉండే సన్నని పొరలు కరుగుతాయి. దాని వల్ల పిక్సల్ దెబ్బతిని అద్దంపై పగుళ్లు వచ్చే ప్రమాదం ఉంది.
- ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్లు, స్మార్ట్‌ఫోన్లను తప్పనిసరిగా నీడలోనే ఉపయోగించాలి. వాటిని చేతిలో పట్టుకోవడం, వాహనంపై ఉంచరాదు.
- బ్లూటూత్ లొకేషన్ సర్వీసెస్, జీపీఎస్, వైఫై వంటి అంతర్గతంగా పనిచేసే అప్లికేషన్లను బంద్ చేయాలి.
- అనవసర సమయాల్లో స్మార్ట్ ఫోన్లను ఎరోప్లేన్ మోడ్‌లో పెట్టడం ఉత్తమం. దానివల్ల కొంతవరకు ఫోన్ చల్లబడే అవకాశం ఉంది.
- అపరిమితంగా ఫోన్ వేడెక్కినట్లు ఫోన్‌లో హెచ్చరిక వస్తే వెంటనే దాని బ్యాటరీని వేరు చేయాలి. లేకపోతే పూర్తిగా బంద్ చేయాలి.
- ఎండలో నిలబడినప్పుడు, ప్రయాణిస్తున్నప్పుడు గ్రాఫిక్స్‌తో కూడిన ఆటలు, జీపీఎస్ ద్వారా సూచికలు తీసుకోవడం, ఇంటర్‌నెట్ ఉపయోగించడం చేయకూడదు. దానివల్ల ప్రాసెసర్‌లో వేడి పెరిగి ఫోన్ పాడైపోతుంది.
- ఎలక్ట్రానిక్ పరికరాలను ఎండలో నిలిపిన కారులో వదిలేసి వెళ్లకూడదు. వెంట తీసుకెళ్లడం మంచిది.
- సెల్‌ఫోన్ ఎరోప్లేన్ మోడ్‌లో ఉంచినా, పూర్తిగా బంద్ చేసినా ఎక్కువ వేడితో ఉన్నప్పుడు మాత్రం చార్జింగ్ చేయకూడదు. అప్పటికే వేడిగా ఉండే బ్యాటరీ అదనంగా తోడయ్యే ఉష్ణాన్ని భరించలేక పాడైపోతుంది.

జాగ్రత్తలు పాటించాలి..



ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. బయట, ఇంట వేడి గాలులతో అధిక ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏ వస్తువు పట్టుకున్నా వేడిగా ఉంటుంది. ఈ తరుణంలో మొబైల్స్ కూడా అధిక ఉష్ణోగ్రతల వల్ల వేడెక్కుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలను స్మార్ట్‌ఫోన్లు తట్టుకోలేవు అందులన ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

– బానోత్ మోహన్, సెల్‌ఫోన్ మెకానిక్, కొత్తగూడెం

దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి..

ఇల్లెందు: డెంగీ వ్యాధి నిర్మూలనకు అందరికీ అవగాహన అవసరమని వైద్యాధికారి డాక్టర్ మురళీ కృష్ణ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇల్లెందులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణ మాట్లాడారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని వాటిని నివారించాలన్నారు. తల నొప్పి, జ్వరం, కండరాల నొప్పులు, వాంతులు, విరోచనాలు, నీరసం, చర్మంపై దుద్దుర్లు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి హరికృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ పరింగిణి, ఎస్‌టీఎస్ శంకర్, ఎల్‌టీ రాజేష్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: దోమల నివారణ చర్యలతో డెంగీ జ్వరాలను అరికడదామని కొమరారం, రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణులు డాక్టర్ లోహిత, డాక్టర్ కవిత అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో డెంగీ నివారణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించి ప్రజలను చైతన్యపర్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతీఒక్కరు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వం పంపిణీ చేసిన దోమ తెరలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.


ఇల్లెందు: అవగాహన ర్యాలీలో ఉద్యోగులు

టేకులపల్లి: దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. దోమలు పెరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో తరచూ శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కంచర్ల వెంకటేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు, వైద్యసిబ్బంది డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు వెంకటేశ్వర్లు, తేజశ్విని, సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, హెచ్‌ఎస్ రత్నకుమార్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సుజాతనగర్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది మండల కేంద్రంలో ప్రదర్శన చేపట్టారు. డెంగీ జ్వరాలకు దోమలే ప్రధాన కారణమని, వాటిని నివారిస్తే డెంగీని నివారించవచ్చన్నారు.